

టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.63

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.63, కనిష్టంగా రూ.40, సరాసరిన రూ.52 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.7°/22.4°

జిల్లా పరిధిలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 16 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



నిండుకుండను తలపిస్తున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం 16,142 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 36,170 క్యూసెక్కులకు చేరింది. బుధవారం 50 వేల క్యూసెక్కులకు పెరగవచ్చని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు భారీగా వరద వస్తోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 35.473 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 211 క్యూసెక్కులు నమోదవుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులకు గాను 1,608.91 అడుగులు నీరు చేరాయి.

20 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 20 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు రొళ్ల మండలంలో 16.4 మి.మీ, హిందూపురం 8.2, అగళి 6.8, గోరంట్ల 5.6, మడకశిర 4, కొత్తచెరువు, సీకేపల్లి, సోమందేపల్లి 3.2, బుక్కపట్నం 2.6, కనగానపల్లి, నల్లమాడ, రామగిరి, అమరాపురం, పుట్టపర్తి, నల్లచెరువు 2.4, ధర్మవరం 1.6, బత్తలపల్లి, తలుపుల, కదిరిలో 1.2 మి.మీ. వర్షం కురిసింది. అల్పపీడంతో మరో రెండు రోజులు వర్షాలు కురవచ్చని అధికారులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు





ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి దేవాలయాల్లో బుధవారం నుంచి గురువారం వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం స్వామి వార్లకు అభిషేకాలు, వివిధ పూజ కార్యక్రమాలు జరుగుతాయి. గురువారం మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద భూతప్ప ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సంతానం లేని మహిళలు, వివిధ వ్యాధుతో బాధపడుతున్నవారు స్నానమాచరించి భూతప్పలు వచ్చే దారిలో బోర్ల పడుకుంటారు. భూతప్పలు వారిపై కాలుమోపుతూ ఆలయం వద్దకు వస్తారు. కాలి స్పర్శ తాకిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ నరసింహ రాజు తెలిపారు.

బీమాపై ధీమా ఏదీ?

పంట రుణాల రెన్యూవల్స్ ప్రక్రియ ముగిసింది. సకాలంలో బీమా ప్రీమియం చెల్లించకపోతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతిన్నపుడు రైతులు పరిహారం పొందే అవకాశం కోల్పోతారు. సాధారణంగా రెన్యూవల్ సమయంలోనే బీమా ప్రీమియం చెల్లించాలి. అయితే ప్రభుత్వం రెన్యూవల్స్ ముగిసిన తర్వాత పంటల బీమాపై మంత్రులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.



- ముగిసిన పంట రుణాల రెన్యూవల్స్
- పంటల బీమా అమలుపై త్రిసభ్య కమిటీ
- ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో సందిగ్ధత

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో టీడీపీ–జనసేన– బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటింది. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై మాత్రమే సర్కార్ ఫోకస్ చేసింది. మిగిలిన ఏ అంశాలనూ పట్టించుకోలేదు. ప్రస్తుతం రైతుల బ్యాంకు రుణాల రెన్యూవల్స్ పూర్తయింది. సాధారణంగా రెన్యూవల్ సమయంలో పంటల బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. గత ఐదేళ్ల జగన్ సర్కార్ రైతులపై భారం పడకూడదనే ఉద్దేశంతో ఉచిత పంటల బీమా పథకం కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని తనే చెల్లించింది. 2024–25 సంవత్సరానికి సంబంధించిన రుణాల రెన్యూవల్స్‌పై కూటమి ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేయాల్సి ఉంది.

ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం..

జిల్లాలోని 32 మండలాల్లో 3,40,286 హెక్టార్ల సాగు భూములు ఉన్నాయి. 3,65,875 మంది చిన్న, సన్నకారు, పెద్ద రైతులు ఉన్నారు. వీరంతా ఏటా మే, జూన్, జూలై నెలల్లో ఇదివరకు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవడం ఆనవాయితీ. ఇదే సమయంలో ప్రభుత్వం పంటలకు బీమా చేయించేది. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం ఎకరాకు రూ.525 చొప్పున ప్రీమియం కట్టించుకుని పంటల బీమా చేయించింది. రుణాలకు వడ్డీతో పాటు ప్రీమియం మొత్తం చెల్లించి పంటలకు బీమా చేయించారు.

రైతులపై భారం పడకూడదని..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచితల పంటల బీమా అమలు చేసింది. ఎకరాకు రూ.525 చొప్పున రైతుల తరపున గడిచిన ఐదేళ్లలో రూ.223.2 కోట్ల ప్రీమియం చెల్లించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతులకు రూ.1882.80 కోట్ల పంటల బీమా పరిహారం వచ్చింది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో రూ.714.07 కోట్లు మంజూరు చేశారు. = గత ఏడాది జిల్లాలో బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటకు వాతావరణ బీమా, ఫసల్ బీమా కింద కంది, వరి, మొక్కజొన్న, ఉచిత బీమా కింద ఆముదం రాగి పంటలకు వర్తింపజేశారు. ఈ ఏడాది ఏయే పంటలకు బీమా వర్తింపజేస్తున్నారో ప్రకటించాల్సి ఉంది. అలాగే పంటల బీమా ప్రీమియం రైతులు స్వయంగా చెల్లించాలా.. లేక ప్రభుత్వమే రైతుల తరపున చెల్లిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

శ్రీసత్యసాయి జిల్లాలో సాగు భూమి
3,40,286 హెక్టార్లు

రైతుల సంఖ్య
3,65,875

ఉచిత బీమా ప్రీమియం కోసం జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చెల్లించినది
రూ.223.2 కోట్లు

5 ఏళ్లలో ఉమ్మడి జిల్లా రైతులకు అందించిన పరిహారం
రూ.1,882.80కోట్లు



పంటల బీమాపై స్పష్టత ఇవ్వాలి



వ్యవసాయ భూమిపై బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి ఇటీవల వడ్డీ కట్టి రెన్యూవల్ చేయించాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాకున్న నాలుగెకరాల భూమికి ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. గత టీడీపీ పాలనలో ఎకరాకు రూ.525 చొప్పున ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించేవాడిని. ఈ ఏడాది కూడా పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తే బాగుంటుంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. – మోహన్‌నాయక్, పెద్దతండా, పుట్టపర్తి మండలం

త్రిసభ్య కమిటీ వేశారు



పంటల బీమాపై త్రిసభ్య కమిటీ వేశారు. త్వరలో విధివిధానాలు ఖరారు అవుతాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాలు సాగయ్యాయి. ఇంకా 15 రోజులు సాగుకు అనుకూలంగా ఉంటుంది. వర్షాలు కురుస్తున్నాయి. రైతులంతా సాగు చేయాలి. సాగు చేసిన పంటలకు ఏవైనా పథకాలు అమలవుతాయి.
– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

- స్టాక్ యార్డుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- టోల్ ఫ్రీ నంబర్ 1800-425-6041

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు పారదర్శకంగా ఉచిత ఇసుకను అందించాలని, ఇందుకోసం స్టాక్ యార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత ఇసుక విధానంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్‌కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మైన్స్ అండ్ జియాలజీ అధికారి రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఉప్పలపాడు, కొడవాండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటాగుళ్ల, రామగిరి తదితర 5 స్టాక్ పాయింట్లలో సుమారు 35 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేసినట్లు చెప్పారు. నదీ పరివాహక ప్రాంతాలైన సీసీ రేవు, పీసీ రేవులలో ఇసుక పూడికతీత కార్యక్రమం త్వరగా చేపట్టాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తీసుకువచ్చేందుకు అయ్యే ఖర్చు మాత్రమే వసూలు చేస్తూ ఇసుక సరఫరా చేస్తామన్నారు. ఫిర్యాదులు, సలహాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800–425–6041ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్రమ, అనధికార ఇసుక తవ్వకాలు, డంపింగ్‌లపై ఉక్కుపాదం మోపుతూ భారీ జరిమానాలను విధిస్తామని ప్రచారం చేయాలన్నారు. భూగర్భ జల నిర్మాణాలు, వంతెనలు, రైల్వే లైన్ల నుంచి 500 మీటర్ల లోపల అక్రమ, అనధికార తవ్వకాలకు పాల్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకట శివరామిరెడ్డి, క్రాంతిశేఖర్‌రెడ్డి, మల్లికార్జునప్ప పాల్గొన్నారు.

‘ఉపాధి’ లక్ష్యాలను అధిగమించాలి

ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, డ్వామా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఏయే పనులు చేపడుతున్నారో వివరాలను మండలాల వారీగా అందజేయాలన్నారు. రోజూ నివేదికలు పంపాలన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి వారితో చర్చించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా పరిషత్ కింద జిల్లాలోని 32 మండలాలకు ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో నివేదికలు అందజేయాలన్నారు. 15వ ఫైనాన్స్, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, జనరల్ ఫండ్ కింద జిల్లాకు ఎంత కేటాయిస్తున్నారో తెలియజేయాలన్నారు. అర్హులకు మాత్రమే సామాజిక భద్రత పింఛన్లు అందజేయాలన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, పీఆర్ ఎస్ఈ మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప, ప్లాంట్ మేనేజర్ వెంకటప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

బెంగళూరు-కలబుర్గికి ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 19, 20వ తేదీల్లో బెంగళూరు–కలబుర్గి మార్గంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19న శుక్రవారం బెంగళూరు జంక్షన్ నుంచి రైలు (06533) రాత్రి 8 గంటలకు బయలుదేరి కలబుర్గికి శనివారం ఉదయం 7.45 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి 20వ తేదీ శనివారం ఉదయం 9.30కు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు బెంగళూరు చేరుతుందన్నారు. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్ యాద్గిరి, వాడి, షాహబాద్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాల విద్య అత్యంత ప్రధానం

పుట్టపర్తి అర్బన్: పాఠశాల విద్య అత్యంత ప్రధానమని, విద్యా పథకాలను సక్రమంగా అమలు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఈఓ మీనాక్షి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి తదితరులతో కలిసి వసతి గృహాల సమస్యలు, స్టూడెంట్ కిట్, మధ్యాహ్న భోజనంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, గుడ్డు, చిక్కీ, రాగిజావ సక్రమంగా అందించాలన్నారు. పోషకాహారం తీసుకోకపోతే విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. హాజరు శాతం ప్రకారం వంట వండాలన్నారు. అధికారులు పాఠశాలల్లో సమస్యలుంటే తనకు నివేదించాలన్నారు. వసతి గృహాల విద్యార్థులకు మెడికల్ చెకప్ చేయించాలన్నారు.

మీ సహకారం మరువలేనిది

- వీడ్కోలు సభలో ఎస్పీ మాధవరెడ్డి



ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: మీ అందరి సహకారంతో విజయవంతంగా విధులు నిర్వర్తించానని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. తన విజయంలో పోలీసులు అధికారులు, సిబ్బంది అందరూ భాగస్వాములేనని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి మన్యం జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్పీ మాధవరెడ్డికి మంగళవారం పుట్టపర్తి సాయి ఆరామంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ విష్ణుతో పాటు డీఎస్పీలు, సీఐలతోపాటు కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. తనకు మొదటి పోస్టింగ్ శ్రీసత్యసాయికి జిల్లాకు వచ్చిందని, ఇక్కడ హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ బాగా సహకరించడం వల్లనే ఎన్నికలతో పాటు అన్ని కార్యక్రమాలూ విజయవంతం చేయగలిగామన్నారు. మీ అందరి కృషి మరువలేనిదన్నారు. ప్రతి పనినీ అవగాహన చేసుకుని ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దసరిగెత్తు

- కాశింస్వామిని దర్శించుకున్న భక్తులు



ఎస్సీ కాలనీలో పానకం దుత్తలతో ఊరేగింపు



బత్తలపల్లిలో కాశింస్వామికి పూజలు నిర్వహిస్తున్న ముజావర్లు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలో హిందూ, ముస్లింలు కలిసి జరుపుకునే బొప్పేపల్లి కాశింస్వామి మొహర్రం ఉత్సవాల్లో కీలక ఘట్టం కోలాహలంగా సాగింది. మంగళవారం పెద్ద సరిగెత్తు అంగరంగ వైభవంగా జరిగింది. మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో పీర్లమకాన్ వద్ద పెద్దసరిగెత్తు వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి ముజావర్లు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వాములకు చక్కెర, పానకాలు చదివించారు. భక్తులు పీర్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల స్వాములను పూలతో అలంకరించి గుండం చుట్టూ తిరిగారు. రాత్రంతా గుండంలోకి మొద్దులను వేసి నిప్పు రగిలించి అలావు తొక్కుతూ కేరింతలు కొట్టారు. మహిళలు, పిల్లలు తేడా లేకుండా కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ వేషధారణలతో ఉన్న వ్యక్తులు తమకు వరస అయిన వారి వద్దకు వెళ్లి గుండంలోని బూడిదను పూసి ఆనందం వ్యక్తం చేశారు. బత్తలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పానకం దుత్తలతో ఊరేగింపుగా వెళ్లడం ఆకట్టుకుంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు గ్రామపెద్దలకు సూచించారు.

నేడు బేరీ

బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం ఉదయం 9 గంటలకు వివిధ గ్రామాల పీర్లు బేరీ అవుతాయి. ఈ కార్యక్రమంతో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయి. ఈ బేరీని తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రజలు తరలిరానున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నారు.



పోట్లమర్రిలో అలావ్ తొక్కుతున్న మహిళలు

జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఉదయం 10 గంటలలోపు బేరీ కార్యక్రమం ముగించాలని ఆయా గ్రామాల పెద్దలకు పోలీసులు సూచించారు.

రహదారులపై నెత్తుటేరులు!

- రోజు రోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఉమ్మడి జిల్లాలో 6 నెలల్లో 2,600కు పైగా రోడ్డు ప్రమాదాలు
- 240 మంది వరకూ మృతి
- కొంప ముంచుతున్న వేగం
- మృతుల్లో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించని వారే!

❑ నాలుగు రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలంలో బైకుపై మితిమీరిన వేగంతో వెళుతున్న మహబూబ్ బాషా రోడ్డు డివైడర్‌కు ఢీకొట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి వయసు 22 సంవత్సరాలు. దీంతో ఆ కుటుంబం తీరని విషాదంలో మునిగిపోయింది.

❑ మూడు నెలల క్రితం బైకుపై వెళుతున్న ముగ్గురు యువకులు నాయనపల్లె క్రాస్ వద్ద ఓ ఐచర్ వాహనాన్ని ఢీకొట్టారు. ఘటనాస్థలిలోనే ముగ్గురూ ప్రాణాలు వదిలారు. వీరందరూ 26 ఏళ్లలోపు వారే. మితీమిరిన వేగంతో వెళ్తున్న క్రమంలో బండిని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాల కారణంగా బాధితులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా పాతికేళ్ల లోపు యువకులు ప్రాణాలు కోల్పోతుండడం ఆయా కుటుంబాలను కలచి వేస్తోంది. విషాద వార్తలను తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణమని నిపుణులు చెబుతున్నారు.

రాయలసీమలోనే ఎక్కువ

రోడ్డు ప్రమాదాల్లో రాయలసీమలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా ముందు వరుసలో నిలుస్తోంది. జాతీయ రహదారుల విస్తీర్ణం ఎక్కువగా ఉండటం దీనికి కారణంగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గడిచిన 6 నెలల్లోనే 2,607 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 90 శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలే ఉండటం గమనార్హం. కార్లు, బస్సుల ప్రమాదాలు ఎక్కువగా హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై చోటుచేసుకున్నాయి. ప్రమాదాల్లో గడిచిన ఆరు నెలల్లో జరిగిన వివిధ ప్రమాదాల్లో 240 మందికి పైగా మృతి చెందారు. మృతుల్లో 70 శాతం 30 ఏళ్ల లోపు వారే కావడం కలచివేస్తున్న అంశం. ఇక.. ప్రమాదాల్లో గాయపడి శాశ్వత వైకల్యం పొందుతున్న వారి సంఖ్యా ఎక్కువగానే ఉంటోంది.

రోడ్డు ప్రమాదాల వివరాలిలా..

నెల	ప్రమాదాల సంఖ్య
జనవరి	342
ఫిబ్రవరి	404
మార్చి	418
ఏప్రిల్	536
మే	501
జూన్	464

వేగమే కొంప ముంచుతోంది..

మితిమీరిన వేగం ప్రాణాలను బలికొంటున్నట్లు తెలుస్తోంది. వేగంగా వెళ్తున్న సమయంలో అదుపుతప్పి వాహనాలను ఢీ కొట్టడం, కిందపడటం కారణంగా యువకులు తీవ్ర గాయాలపాలవడం, ఘటనా స్థలిలోనే మృతి చెందడం సంభవిస్తున్నాయి. పిల్లలు తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి 150 సీసీ నుంచి 350 సీసీ బైకులు కొనుక్కుంటున్నారు. బైకు కొన్న కొద్దిరోజులకే తన కుమారుడి విషాద వార్త వినాల్సి వచ్చిందని గుత్తికి చెందిన ఓ బాధిత తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. బైకులు నడిపే సమయంలో చాలా మంది హెల్మెట్ వాడకపోవడం ప్రాణాల మీదకు తెస్తోంది. ఎక్కువ వేగంగా వెళ్లడమనేది యువత ఈ రోజుల్లో ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. అత్యంత వేగంగా వెళితే తమకు మంచి గుర్తింపు లభిస్తుందనేది వారి ఆలోచనగా ఉంటోంది. కానీ అది మానసిక జబ్బు. తల్లిదండ్రులే వీరికి మంచి కౌన్సెలింగ్ ఇవ్వచ్చు.
–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, అనంతపురం

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మొహర్రం



పుట్టపర్తిలో కొలువుదీరిన పీర్లు

పుట్టపర్తి టౌన్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చావిడిలో పీర్లను దర్శించుకుని చక్కెర, బెల్లం చదివింపులు చేయిస్తున్నారు. మొక్కుబడి ఉన్న పీర్లను ఇళ్ల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా చావిడికి చేరుస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పెద్ద సరిగెత్తును అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పొలాల్లో వృద్ధుడి మృతదేహం

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై లాలేపల్లి క్రాస్ సమీపంలోని పొలాల్లో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడిని మొరంపల్లికి చెందిన చాకలి నరసింహప్ప (75)గా గుర్తించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. రెండు రోజుల క్రితం మృతి చెందినట్లుగా నిర్ధారించారు. వయసు మీద పడటంతో సాధారణంగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఎలాంటి కేసు నమోదు చేయకుండానే మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

వీరభద్రుని సేవలో ఐడబ్ల్యూఏఐ చైర్మన్



తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

లేపాక్షి: ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ), ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ చైర్మన్ విజయ్‌కుమార్ లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. మంగళవారం సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని వింతలు, విశేషాలను ఆయన తిలకించారు. పాపనాశేశ్వర, రఘునాథ, దుర్గాదేవి, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి, ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, పురావస్తు శాఖ సీఏ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ బాలనరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు.

కష్టాల్లో తమలపాకు రైతులు

- స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు
- ధర తగ్గుముఖంతో నష్టాలు



తమలపాకు తోట



పెండీలు కడుతున్న కూలీలు

అమరాపురం: జిల్లాలోనే తమలపాకు తోటలకు మడకశిర నియోజకవర్గం ప్రసిద్ధి. ముఖ్యంగా అమరాపురం మండలంలో తమలపాకు తోటలు అధిక విస్తీర్ణంలో ఉన్నాయి. మిగిలిన గుడిబండ, రొళ్ల, గుడిబండ, అగళి మండలాల్లోనూ తమలపాకు తోటలు ఉన్నాయి. దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా మూడు వేల ఎకరాల్లో తమలపాకు తోటలు ఉన్నాయి. అయితే సరైన మార్కెట్ సదుపాయం లేకపోవడంతో తమలపాకు రైతులు తీవ్ర నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది.

అంతరపంటగా తమలపాకు

జిల్లాలో ఏ నియోజకవర్గంలోనూ లేని విధంగా మడకశిర నియోజకవర్గంలో అత్యధిక విస్తీర్ణంలో తమలపాకు తోటలు విస్తరించి ఉన్నాయి. వక్క తోటల్లో అంతర పంటగా రైతులు తమలపాకు సాగు చేపట్టారు. ఒకప్పుడు తమలపాకు సాగు రైతులను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించింది. ఈ ప్రాంతంలో వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు తమలపాకు తోటలు ఊరటనిచ్చాయి. అయితే సరైన మార్కెట్ వసతి లేక ప్రస్తుతం తమలపాకు రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

దక్కని గిట్టుబాటు ధర

ప్రధానంగా తమలపాకులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. గతంలో ధరలు రికార్డు స్థాయిలో ఉండేవి. దీంతో తమలపాకు సాగుపై రైతులు ఆసక్తి చూపడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పంట చేతికి వచ్చే సమయంలో ధర అమాంతం పడిపోయింది. దీనికి తగినట్లుగా స్థానికంగా మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రైతులే స్వయంగా హిందూపురం, కర్ణాటక ప్రాంతాలకు తమలపాకు పెండీలను తరలించాల్సి వస్తోంది. ఆయా మార్కెట్లలో దళారుల బెడదకు తోడు కమీషన్లు అత్యధికంగా దండుకుంటున్నారు. దీంతో గిట్టుబాటు ధర లేక నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. గత ఏడాది చలికాలంలో తమలపాకు పెండీ రూ.8వేల వరకు అమ్ముడుపోయింది. ప్రస్తుత మార్కెట్‌లో పెండీ ధర కేవలం రూ.2వేల నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది.

కూలిలు చేతి నుంచి ఇస్తున్నా..



స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేదు. రోజూ మడకశిర నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తమలపాకు పెండీలు మార్కెట్‌కు తరలిస్తున్నాం. ఎక్కువగా హిందూపురం మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకుంటున్నాం. మరికొందరు రైతులు కర్ణాటకలోని శిర, హిరియూర్, చెళ్లకెర తదితర ప్రాంతాలకు తీసుకెళుతున్నారు. ఆయా మార్కెట్‌లలో దళారుల బెడద ఎక్కువగా ఉంటోంది. కమీషన్లు ఎక్కువగా వసూలు చేస్తున్నారు. రవాణా ఖర్చులు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో తమలపాకు రైతులు నష్టపోతున్నారు. చివరకు కూలీలకు చేతి నుంచి డబ్బులు చెల్లించాల్సి వస్తోంది.

– మల్లికార్జున, అమరాపురం

ఉపాధి పథకానికి అనుసంధానించాలి



ఉపాధి పథకం పనులతో అనుసంధానం చేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. రోజూ వక్క, తమలపాకు తోటల్లో కూలీలకు చేతి నిండా పని ఉంటుంది. రోజుకు ఓ కూలీకి రూ.500 చొప్పున చెల్లిస్తున్నా. ప్రస్తుతం మార్కెట్లో పెండీ (100) తమలపాకులు రూ.2వేలతో అమ్ముడుపోతున్నాయి. పెట్టుబడులకు సైతం గిట్టుబాటు కావడం లేదు. స్థానికంగా మార్కెట్ సదుపాయం లేకపోవడం కూడా నష్టాలకు కారణమవుతోంది.

– ఈర క్యాతరాయప్ప విరుపాసముద్రం, అమరాపురం మండలం

మొక్కల పెంపకంతోనే మనుగడ

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మొక్క నాటి నీళ్లు పోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ ఉద్యమ స్థాయిలో మొక్కలు నాటి సంరక్షించినప్పుడే మానవ మనుగడ సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపు మేరకు ‘హరిత అనంత’ కార్యక్రమంలో భాగంగా పీఆర్‌ఐ సబ్ డివిజన్–2 కార్యాలయ ఆవరణలో ఈఈ చంద్రశేఖర్, డీఈఈ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటి నీళ్లు పోసి, మాట్లాడారు. చెట్లను విచక్షణారహితంగా నరికేస్తుండడంతో అనేక రకాల రుగ్మతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరైపోతున్నారన్నారు. ప్రభుత్వాలు మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నా ప్రజలు తమ బాధ్యతను విస్మరించి, చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ అందక లక్షలాది మంది అర్ధంతరంగా ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అలాంటి విపత్కర పరిస్థితుల నుంచి బయటపడాలన్నా... భావి తరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఓబుళమ్మ, పీఆర్‌ఐ సబ్ డివిజన్ ఉద్యోగులు సురేష్ రెడ్డి, జగన్, జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఎల్‌ఐసీ సమస్యలు పరిష్కరించాలి : ఎస్టీయూ



జీఎల్‌ఐసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఏపీజీఎల్‌ఐసీ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీఎల్‌ఐసీ అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి మిస్సింగ్ క్రెడిట్ ఖాతాల క్రమబద్ధీకరణ సక్రమంగా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మెచ్యూర్ అయిన బాండ్లకు ఫైనల్ పేమెంట్స్ సంబంధిత డీడీఓ ఏపీజీఎల్‌ఐసీ లాగిన్‌లో పంపినా డిప్యూటీ డైరెక్టర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రపోజల్స్‌ను తన లాగిన్‌లోనే పెట్టుకుని రాష్ట్ర కార్యాలయానికి పంపకుండా ఆన్‌లైన్ సమస్య అంటూ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. అన్ని జిల్లాలకు సంబంధించిన ఫైనల్ పేమెంట్స్ సీఎఫ్‌ఎంఎస్‌కు వెళ్తున్నాయన్నారు. కేవలం ఉమ్మడి జిల్లాలో మాత్రమే పెండింగ్ ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ అధికారులను కలిసి పీఎఫ్ సమస్యలపై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ స్లిప్స్ ఆన్‌లైన్‌లో రెండేళ్లుగా పొందుపరచడం లేదన్నారు. వెంటనే ఆన్‌లైన్ చేయాలని, రుణాల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్లు సుగుమంచి సురేష్ బాబు, ఫణి భూషణ్, జిల్లా నాయకులు పరమేశ్వర రెడ్డి, నాయకులు కరణం చంద్ర శేఖర్ స్వామి, ప్రభాకర్, సురేష్ కుమార్, రాజన్న, కృష్ణమూర్తి నాయుడు, రమేష్, గంగాధర్, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్ సర్వీసులు

పుట్టపర్తి టౌన్: భక్తుల సౌకర్యార్థం ఈ నెల 20న పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని డిపో మేనేజర్ ఇనయతుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు వేలూరు గోల్డన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం అదనంగా చూపించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సర్వీసు పుట్టపర్తి ఆర్టీసీ డిపో నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు బయల్దేరుతుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా, పుట్టపర్తి బస్టాండ్ నుంచి టికెట్లు రిజర్వేషన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73828 60486, 99592 25857, 94402 01570 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోస్టాఫీసు వద్ద ఖాతాదారుల ధర్నా



పోస్టాఫీసు వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నల్లమాడ: స్థానిక పోస్టాఫీసు వద్ద మంగళవారం ఖాతాదారులు ఆందోళన నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ఖాతాదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ.. పోస్టాఫీసులోని తమ పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు బీమా పథకాలకు సంబంధించి మొత్తం రూ. 20 లక్షలకు పైగా సొమ్మును బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాస్‌నాయక్ కాజేసి పరారీలో ఉన్నాడని ఆరోపించారు. తపాలా శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టినా ఇంత వరకూ తమకు న్యాయం జరగలేదన్నారు. ఖాతాల పరిశీలన నిమిత్తం అంటూ దండోరా వేయించి మరీ తమవద్ద ఉన్న పాసు పుస్తకాలు, ఇతర రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకుని వెళ్లారన్నారు. రోజులు గడుస్తున్నా తమకు డబ్బు కానీ, పాసుపుస్తకాలు, బ్యాండ్ పేపర్లు తిరిగి ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మొత్తాలను చెల్లించే వరకూ అక్కడి నుంచి కదలబోమని భైఠాయించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ఖాతాల పరిశీలన సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఖాతాదారులతో పాటు సీపీఐ జిల్లా నాయకుడు ఎం.గంగాధర్, సీపీఎం మండల కార్యదర్శి గోవిందు పాల్గొన్నారు.

కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం సమీపంలో ఉన్న కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ తచ్చాడుతుండగా స్థానికులు గమనించి, విచారించారు. భాష రాకపోవడంతో అన్నం పెట్టారు. భోజనం ముగించుకున్న తర్వాత అక్కడే పడుకుని నిద్రలోనే మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఆశ్రమంలోని వారు ఎంతలేపినా లేవకపోవడంతో అనుమానం వచ్చి సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఉదయం ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి ముఖంపై, చేతులపై అక్కడక్కడ గోకుడు గాయాలు గుర్తించారు. ఇతర ఆధారాలేవి లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు బత్తలపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతురాలు వీరనారమ్మ

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. వివరాలు... తాడిమర్రి మండలం నార్సింపల్లి గ్రామానికి చెందిన 16 మంది కూలీలు ఈ నెల 8న నార్పల మండలంలో చీనీ కాయల కోతకు బొలెరో వాహనంలో వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో బత్తలపల్లి మండలం మాల్యవంతం సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాకే వీరనారమ్మ(48) అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఓ కుమారుడు ఉన్నాడు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కదిరి టౌన్: పట్టణ రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫారం వద్ద రైలులో భిక్షాటన చేసుకునే వ్యక్తి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్‌ఐ రహీం మంగళవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు నలుపు, పసుపు రంగు కలిసిన నిలువు, అడ్డు గీతల పుల్‌షర్ట్, సిమెంట్ రంగు ప్యాంట్, గీతల టవాల్ ధరించి ఉన్నాడు. మణికట్టు వద్ద ఎర్రదారం కట్టి ఉంది. ఇతర ఆధారాలు ఏవీ లభ్యం కాలేదు. దీంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27642కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

మెరుగైన వైద్యం అందించండి

- ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగరాజు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌ఎం పీఓ నాగరాజు

తాడిమర్రి: గ్రామీణ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా పని చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక వైద్యాధికారి హరితతో కలసి పెద్దకోట్ల, ఎం.అగ్రహారం గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి వారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఏఎన్‌ఎంలు లక్ష్మి, రేష్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

అమరాపురం: జలజీవన్ మిషన్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లోని ఇంటింటికీ తాగు నీటిని అందించాలని అధికారులకు కేంద్ర బృందం సభ్యులు అనిల్‌కుమార్ బారి, శిశిర్‌కుమార్ బషీర్ సూచించారు. మండలంలోని హేమావతి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంకాలం అధికారులతో వారు సమావేశమై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటింటికీ తాగునీటి పథకం అమలుపై ఆరా తీశారు. జలజీవన్ మిషన్ నిధుల వినియోగాన్ని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని వీధులను పరిశీలించారు. వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణాలపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శి నరేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

‘పెసర’లో యాజమాన్యం పాటించండి



పెసర విత్తనం అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: పెసర సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన తెలిపారు. 96వ భారతీయ వ్యవసాయ మండలి దినోత్సవం సందర్భంగా 100 రోజుల వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేవీకేలో రైతు ఉత్పత్తి దారులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర చందన మాట్లాడారు. పెసర సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం షెడ్యూలు కులాల వారికి డబ్ల్యూజీజీ–42 రకం పెసర విత్తనాన్ని అందజేశారు. కార్యక్రమంలో పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, ప్రభు మిత్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



దేవరాజు (ఫైల్)

కుందుర్పి: విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామానికి చెందిన చాకలి దేవరాజు(36)కు భార్య శోభ, ఐదేళ్ల లోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. బెస్తరపల్లి నివాసి రైతు తలారి ఆనంద్‌కు చెందిన 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని రెండేళ్లుగా టమాట, ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం టమాట పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన తోటలో ఉన్న విద్యుత్ మోటార్ స్టార్టర్ పెట్టె తలుపు తీస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



పుట్టపర్తికి పాదయాత్రగా చేరుకుంటున్న మహారాష్ట్ర భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న హర్షవర్ధన్ వార్వే బృందం

పుట్టపర్తికి చేరిన మహారాష్ట్ర భక్తులు

పుట్టపర్తి రూరల్/ప్రశాంతి నిలయం: మహారాష్ట్రకు చెందిన సత్యసాయి భక్తుల పర్తియాత్ర మంగళవారం పుట్టపర్తికి చేరుకుంది. దాదాపు 1,200 మందికి పైగా భక్తులు పుట్టపర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏటా ఆషాడ ఏకాదశికి తమ ఆరాధ్య దైవం సత్యసాయి సన్నిధికి చేరుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ధర్మవరం వరకూ రైలులో చేరుకుని అక్కడ నుంచి సత్యసాయి పల్లకీ మోస్తూ భజనలతో పాదయాత్రగా పుట్టపర్తికి చేరుకుంటున్నామన్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలో ఆషాడ ఏకాదశి వేడుకలను ప్రారంభించారు. గోవా, మహారాష్ట్రకు చెందిన బాలవికాస్ పూర్వ విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం సంగీత విద్వాంసుడు హర్షవర్ధన్ వార్వే బృందం సంగీత కచేరీ భక్తులను అలరించింది.